తీరనున్న కరెంట్ కష్టాలు

- ప్రత్యేక ఫీడర్ ఏర్పాటుతో కోతలకు చెక్
- మరో వారం రోజుల్లో నూతన లైన్

రాజోళి: కొన్నేళ్లుగా కరెంట్ కోతలతో సతమతమైన మండల వాసులకు ఊరట లభించనుంది. విద్యుత్ సమస్యతో కొన్నాళ్లుగా ఉక్కిరిబిక్కిరి అయ్యారు. తరుచుగా విద్యుత్ సరఫరాలో అంతరాయంతో స్థానికులు నరకయాతన అనుభవించారు. రాజోలి వాసులు ఇబ్బందులను గుర్తించి ప్రత్యేక ఫీడర్ ఏర్పాటు చేసి కోతలకు చెక్ పెట్టేందుకు చర్యలు తీసుకున్నారు.

ఏళ్ల తరబడి..

మండల కేంద్రంలో ఉన్న ఐదు ఎంవీఏ సామర్థ్యం ఉన్న సబ్ స్టేషన్ నుంచి నుంచి పాత రాజోళికి మాత్రమే కరెంట్ సరఫరా అవుతోంది. కాగా అప్పటికే రాజోళి గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటైన కొత్త రాజోళి, తుమ్మలపల్లెలు మాత్రం 24 గంటల కరెంట్ సరఫరాకు నోచుకోలేదు. ఉన్న సబ్ స్టేషన్ నుంచి వ్యవసాయ రంగానికి అధికంగా విద్యుత్ సరఫరా చేస్తున్నారు. గృహ వినియోగదారుకు నామమాత్రంగా సప్లై చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు.

చివరి దశలో పనులు..

కొత్త రాజోళిలో ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని నూతన లైన్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. నూతన లైన్ ద్వారా కేవలం ఇళ్లకు మాత్రమే 24 గంటలు విద్యుత్ సరఫరా చేయాలని నిర్ణయించారు. రాజోళిలో ఉన్న సబ్ స్టేషన్ నుంచి పాత రాజోళి వరకు కొత్తలైన్ ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగా గతంలో సర్వే చేయని కాలనీలు కూడా ప్రస్తుతం సర్వే చేసి మండల కేంద్రంలో పూర్తి స్థాయిలో కరెంట్ సరఫరా జరిగేలా కొత్త ఫీడర్‌ను ఏర్పాటు చేశారు. అందులో భాగంగా కేవలం ఇళ్లకు కరెంట్ సప్లై చేసే విధంగా రూ.14 లక్షలతో పనులు చేపట్టారు. ప్రస్తుతం పనులు చివరి దశకు చేరుకున్నాయి. విద్యుత్ లైనింగ్ పనులు, స్తంభాల ఏర్పాటు ముమ్మరంగా సాగుతుండగా, మరో వారం రోజుల్లోగా పనులు పూర్తి చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు. ఈ సమయానికే పనులు పూర్తి అయ్యే అవకాశం ఉండగా, ఈదురు గాలులు, అకాల వర్షాల కారణంగా పనుల్లో ఆలస్యం జరిగినట్లు అధికారులు తెలిపారు. మొత్తానికి కొత్త ఫీడర్‌తోనైనా రాజోళిలో కరెంట్ కష్టాలు తీరనుండటంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


రాజోళిలో కొనసాగుతున్న నూతన లైన్ పనులు



అధికారుల అలసత్వం వల్లే..

గతంలో అధికారులు కరెంట్ సప్లై ఇవ్వడంలో బాగా నిర్లక్ష్యం చేశారు. పూర్తి స్థాయిలో సర్వే చేయకుండా కేవలం పాత రాజోళికి మాత్రమే సప్లై అందించారు. వ్యవసాయ రంగానికి కూడా కలిపి ఇవ్వడంతో కోతలు విధించారు. తాజాగా శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా లేక అవస్థలు పడ్డాం. చీకట్లో ఉక్కపోతలకు ప్రజలు, చిన్నారులు ఉక్కిరిబిక్కిరయ్యారు.

– విజయ్‌కుమార్, సీపీఎం నాయకులు రాజోళి



వారంలోగా పనులు పూర్తి..

రాజోళి గ్రామ పంచాయతీ పరిధిలోని తుమ్మలపల్లె, కొత్త రాజోళికి కరెంట్ కోతలు నివారించేందుకు ప్రత్యేక లైన్ ఏర్పాటు చేస్తున్నాం. రూ.14 లక్షలతో చేపట్టిన పనులు ప్రస్తుతం పూర్తి దశకు చేరుకున్నాయి. స్తంభాలు, తీగలు బిగించే పనులు కొనసాగుతున్నాయి. లైన్ పూర్తి అయితే 24 గంటల కరెంట్ సరఫరా చేస్తాం.

– సుబ్బరాయుడు, ఏఈ



ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు


ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు


పాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో..

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ప్రధాన దేవాలయాల్లో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి, సద్దలోనిపల్లి కృష్ణస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప, శేషంపల్లి శివసీతారామస్వామి, చర్లగార్లపాడు వేంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా అర్చకులు రమేషాచారి, మధుసూదనాచారి, రవిచారిలు స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కొంత మంది భక్తులు స్వామి వారికి దాసంగాలు నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లదరావు, ఈఓ సత్యచంద్రారెడ్డి నాయకులు మధుసూదన్‌రెడ్డి, సీతారామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి, చంద్రశేఖర్‌రావు, బాబూరావు, ఆలయ సిబ్బంది ఉరుకుంద, శ్రీను, రంగస్వామి, శివమ్మ, కృష్ణ తదితరులు ఉన్నారు.

కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురంలో వెలసిన పాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారికి అభిషేకం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులకు అన్నదానం చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

పట్టణ పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం

అలంపూర్: పట్టణ పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ అన్నారు. శనివారం మున్సిపాలిటీ 2వ వార్డులోని సంతోష్ నగర్‌లో చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ వడ్డేగుంత వద్ద ఉన్న పైప్‌లైన్‌లో చేరిన చెత్త చెదారాన్ని పూర్తిగా తొలగిస్తామన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. వడ్డేగుంత పార్కులో ఎర్రమట్టి వేయాలని సంతోష్ నగర్ యువత చైర్‌పర్సన్‌ను కోరగా దీనికి సానుకూలంగా స్పందించారు. ఆమె వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ సామెల్, కార్మికులు కుమార్, ఏసేపు, నాయకులు రాజేష్, ఆనంద్, బాలరాజు తదితరులు ఉన్నారు.


అలంపూర్‌లో పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

సజావుగా సర్వసభ్య సమావేశం


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైస్ చైర్మన్, కౌన్సిలర్లు

అలంపూర్: అయిజ మున్సిపల్ సర్వసభ్య సమావేశం సజావుగా సాగింది. శనివారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ చిన్న దేవన్న అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మొత్తం తొమ్మిది అంశాల ఆమోదంపై చర్చకొనసాగింది. ఎనిమిది అంశాలను సభ్యులు ఆమోదించారు. మూడో అంశంగా ఉన్న తైబజార్ కూరగాయాల మార్కెట్ వేలం పాటను సభ్యులు తిరస్కరించారు. రోడ్ల పక్కన పేదలు చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నవారికి ఇబ్బందులు తలెత్తుతాయని సభ్యులు సభ దృష్టికి తీసుకెళ్లారు. పేదలు ఆర్థికంగా నష్టపోతారని వివరించారు. దీంతో చైర్మన్, కమిషనర్‌లు మూడో అంశాన్ని తిరస్కరిస్తునట్లు ప్రకటించారు. అంతకుముందు పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ వైస్ చైర్మన్ మాల నరసింహ్ములు ఆధ్వర్యంలో కౌన్సిలర్లు కమిషనర్ గోల్కొండ నర్సయ్యకు వినతిపత్రం అందజేశారు. సమావేశంలో ఏఈ గోపాల్, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

టీకాలతో వ్యాధులు దూరం


ఆవుకు టీకా వేస్తున్న ఎల్ఎస్ఏ లతీఫ్

శాంతినగర్: ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వివిధ టీకాల ద్వారా పశువులకు సంక్రమించే వ్యాధులు దూరమవుతాయని ఎల్ఎస్ఏ లతీఫ్ అన్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటి పరిధిలోని వడ్డేపల్లి, శాంతినగర్‌లో పశువులకు గొంతువాపు, జబ్బవాపు వ్యాధి నివారణ టీకాలు శనివారం వేశారు. ఆయా వార్డుల్లోని 83 గేదెలు, 25 ఆవులు, ఎద్దులకు టీకాలు వేసినట్లు పశువైద్యశాల సిబ్బంది తెలిపారు. పశుసంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

పూడికతీత పనులు పరిశీలన


కూలీలకు సూచనలు చేస్తున్న ఎంపీడీఓ రవీంద్ర

శాంతినగర్: ఉపాధి పనులు చేసే కూలీలు జాగ్రత్తలు పాటిస్తూ పనిచేయాలని ఎంపీడీఓ రవీంద్ర సూచించారు. శనివారం వడ్డేపల్లి మండలంలోని జిల్లెడుదిన్నె గ్రామ పంచాయతీ పరిధిలోని ఆర్డీఎస్ ప్రధాన కాల్వలో చేపడుతున్న పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో ఎంపీడీఓ మాట్లాడుతూ ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నందున ఉదయం 7 గంటల నుంచి 12 గంటల లోపు పనులు ముగించుకోవాలని సూచించారు. వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కొలతల ప్రకారం పనిచేస్తేనే కూలి రూ.272 వస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఏపీఓ విజయలలిత, పంచాయతీ కార్యదర్శి జ్ఞానేశ్వరి ఉన్నారు.

బాలల హక్కుల పరిరక్షణే ధ్యేయం

శాంతినగర్: బాలల హక్కుల పరిరక్షణే ధ్యేయమని ఎంవీ ఫౌండేషన్ రాష్ట్ర చీఫ్ కోఆర్డినేటర్ రాజేంద్రప్రసాద్ అన్నారు. శనివారం వడ్డేపల్లి మహిళా సమాఖ్య భవనంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ కమిటీ బాలల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అనంతరం ఎంపీడీఓ రవీంద్ర మాట్లాడుతూ బాల్య వివాహాలు, బాల కార్మికులు లేకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధులు సుధాకర్, బసవరాజు, గొల్ల సుధాకర్, విక్రమసింహారెడ్డి, హనిమిరెడ్డి, సాయికుమార్, నాగపుల్లయ్య, సీఆర్‌పీఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

నలుగురిపై కేసు నమోదు

ఎర్రవల్లిచౌరస్తా: ఇతరుల ప్లాటులో అక్రమంగా గుడిసెలు వేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఇటిక్యాల ఎస్ఐ గోకారి శనివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి ఇటిక్యాల మండలంలోని కొండేరు గ్రామానికి చెందిన బషీర్‌మియ్యాకు కొండేరు స్టేజీలో జాతీయ రహదారి పక్కన ఓపెన్ ప్లాట్ ఉంది. కొండేరు, పుటాన్‌దొడ్డి గ్రామాలకు చెందిన సగి ప్రకాష్, ఉశేన్, చిన్న మద్దిలేటి, అంజిలతో పాటు మరి కొంతమంది తమ పూర్వీకులదని బషీర్‌మియ్యాకు చెందిన ప్లాట్‌లో గుడిసెలు వేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

వరద బాధితుల ప్లాట్ల విచారణ

అలంపూర్: వరద బాధితులకు ఇళ్ల స్థలాలపై విచారణ కొనసాగుతుంది. పట్టణంలోని 2009 వరద బాధితులకు అప్పటి ప్రభుత్వం పంపిణీ చేసిన ఇళ్ల స్థలాల పట్టాలపై రెండో రోజు శనివారం రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. 800 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ఇచ్చారు. ఇందులో అర్హులకు కాకుండా అనర్హులకు ఇళ్ల పట్టాలిచ్చారని ఫిర్యాదులు అందాయి. దీంతో కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశాల మేరకు లబ్ధిదారుల ఇళ్ల పట్టాలపై విచారణ చేస్తున్నారు. ఎనిమిది బృందాలు ఇంటింటికి వెళ్లి నిజమైన లబ్ధిదారులను గుర్తిస్తున్నారు. మరో రెండు రోజులలో విచారణ పూర్తి చేస్తామని తహసీల్దార్ సుభాష్ నాయుడు తెలిపారు.


విచారణ చేస్తున్న రెవెన్యూ అధికారులు

మార్మోగిన అంజన్న నామస్మరణ


దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని బీచుపల్లి పుణ్యక్షేత్రం శనివారం భక్తులతో కిక్కిరిసింది. ఈసందర్భంగా ఆంజనేయస్వామి నామస్మరణతో మార్మోగింది. జాతరలో భాగంగా చివరి శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆంజనేయస్వామికి పంచామృత అభిషేకం, ఆకుపూజ వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై కృష్ణా నదిలో పుణ్య స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు దాసంగాలతో మట్టి కుండలలో ప్రత్యేక నైవేద్యం తయారుచేసి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

రమాబాయి అంబేడ్కర్‌కు ఘన నివాళి

అలంపూర్: అయిజ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సతీమణి రమాబాయి వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశం కోసం ఆమె చేసిన త్యాగాలను గుర్తుచేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గ్రామీణులకు చట్టాలపై అవగాహన అవసరం


అవగాహన కల్పిస్తున్న జడ్జి ప్రభాకర్

మల్దకల్: గ్రామీణులకు చట్టాలపై అవగాహన అవసరమని గద్వాల అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ప్రభాకర్ అన్నారు. శనివారం మండలంలోని పెద్దపల్లి, పాల్వాయి గ్రామాలలో న్యాయ సేవా సదస్సును సర్పంచ్‌లు పెద్దకిష్టన్న, శివరామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు చట్టాలపై మరింత అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యమన్నారు. బాధితులకు న్యాయం చేయడానికే చట్టాలు ఉన్నాయన్నారు. చట్టం దృష్టిలో ధనికుడు, పేద అనే బేధం లేదన్నారు. నిందితులకు శిక్షలు విధిస్తే మరోసారి నేరాలు చేసేందుకు భయపడతారన్నారు. కోర్టుల్లో ఉచిత న్యాయ సహాయం అందించబడుతుందని, దీనిని వినియోగించుకోవాలని కోరారు. క్షణికావేశాలకు పోయి ఘర్షణ పడి పోలీసుస్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరుగుతూ డబ్బును, సమయాన్ని వృథా చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శేఖర్, న్యాయవాదులు, లీగల్ వలంటరీ, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు ఏర్పాట్లు


స్థలాన్ని పరిశీలిస్తున్న బీఎస్ కేశవ్

గద్వాల రూరల్: జూన్ 12వ తేదీన సీఎం కేసీఆర్ గద్వాలకు రానున్న నేపథ్యంలో ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ పర్యవేక్షించారు. సీఎం పర్యటన సందర్భంగా పట్టణంలోని తెలంగాణ చౌరస్తా సమీపంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి స్థలాన్ని, వేదిక, పార్కింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎన్‌బీ మురళి, శ్రీను, నాయకులు కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

కేసుల దర్యాప్తులో సాంకేతికతను వినియోగించాలి


సిబ్బందితో సమీక్షిస్తున్న డీఎస్పీ రంగస్వామి

గద్వాల క్రైం: కేసుల దర్యాప్తులో సాంకేతికతను వినియోగించి త్వరితగతిన పరిష్కరించాలని డీఎస్పీ రంగస్వామి ఆదేశించారు. శనివారం రూరల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, రికార్డులను పరిశీలించారు. అనంతరం కేసుల వివరాలపై ఆరా తీశారు. ఒత్తిడి లేకుండా పని చేయాలని, విధుల నిర్వహణతో పాటుగా ఆరోగ్యంపై దృష్టి పెట్టాలన్నారు. రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పోలీస్ స్టేషన్‌లో 5ఎస్ అమలు తీరును పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఆయన వెంట సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ ఆనంద్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

బాలశక్తి పురస్కార్ అవార్డులకు దరఖాస్తు చేసుకోండి

గద్వాల అర్బన్: మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ బాల అవార్డులో భాగంగా 2023–24 సంవత్సరంలో అందించనున్న బాలశక్తి పురస్కార్ అవార్డులకు అర్హులైన చిన్నారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ శాఖ జిల్లా అధికారిణి ముషాయిదాబేగం ఒక ప్రకటనలో తెలిపారు. సాహసం, క్రీడలు, సామాజిక సేవ, శాస్త్ర, సాంకేతి తదితర రంగాల్లో ప్రతిభ కనబర్చిన 6–18ఏళ్లలోగా బాలబాలికలు 15 అక్టోబర్ 2023 లోగా www.iccw.co.inఅనే వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ల్యాబ్ టెక్నీషియన్ సస్పెన్షన్

గద్వాల క్రైం: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంక్‌లో టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్న ఖలీల్‌ను సస్పెండ్ చేస్తు శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. గత కొన్ని రోజుల నుంచి విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించగా అధికారులు మందలించినా పని తీరులో మార్పు లేకపోయింది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అతనిపై సస్పెన్షన్ వేటు వేసినట్లు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ కిషోర్‌కుమార్ తెలిపారు.

ఓటరు జాబితాను పూర్తి చేయాలి

ఆత్మకూర్: ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ఓటరు నమోదు, జాబితా సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని తహసీల్దార్ సింధూజ అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. 2023 అక్టోబర్ ఒకటో తేదీ నాటికి 18 ఏళ్ల పూర్తయిన వారి వివరాలను సేకరించి ఓటరుగా నమోదు చేయించాలని సూచించారు. జూన్ 23 వరకు ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితా సవరణ కార్యక్రమం పకడ్బందీగా చేపట్టాలని బూత్ లెవల్ అధికారులకు వివరించారు. కార్యక్రమంలో డీటీ చాణక్య, ఆర్ఐలు జయమ్మ, నర్సింహులు, సీనియర్ అసిస్టెంట్ నాగేంద్రప్రసాద్, బీఎల్ఓలు ఉన్నారు.


అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ సింధూజ

నరేంద్రమోడీ సారథ్యంలోనే అభివృద్ధి

పెబ్బేరు: ప్రధాని నరేంద్రమోడీ పేదల కోసం ప్రవేశపెట్టిన పథకాలను ప్రతి ఇంటికి ప్రచారం చేయాలని బీజేపీ ఓబీసీ అధికార ప్రతినిధి శ్రీశైలం అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఈ నెల 30 నుంచి వచ్చే నెల 30వ తేదీ వరకు స్వశక్తి కరణ్ బూత్ కమిటీలు, కార్యకర్తలు, నాయకులు గ్రామాల్లో తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారని గుర్తుకు చేసి ఓటర్లను చైతన్యం చేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కంచె అంజనేయులు, మండల అధ్యక్షుడు భగవంతు యాదవ్, నాయకులు వేమారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, గోనేల సహదేవుడు, రాఘవేంద్రగౌడ్, సర్వేశ్వర్‌రెడ్డి, రామకృష్ణ, వెంకట్రామిరెడ్డి, మురళీధర్‌చారి, గోవిందునాయుడు, శ్రీనివాస్‌రెడ్డి, కుబేరు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

క్లుప్తంగా

రైతుబంధుకు దరఖాస్తుల ఆహ్వానం

మానవపాడు: మండలంలోని రైతులు వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవాలని శనివారం వ్యవసాయ మండల అధికారి సుబ్బారెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు ఫారం, కొత్త పట్టాదారు పాస్‌బుక్, బ్యాంకు పాసుబుక్, ఆధార్ జిరాక్స్ కాపీలను కార్యాలయంలో అధికారులకు అందించాలని కోరారు.

రేపు అఖండ భజన

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో 'నీ గానమే నా ప్రాణం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త దామోదర్ రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29న ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అఖండ భజన నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. సమితి వ్యవస్థాపకుడు దేశ్‌ముఖ్ పాండే హాజరవుతారని వివరించారు.

బీమాపై అవగాహన కల్పించాలి

శాంతినగర్: కల్లుగీత కార్మికులకు గీతబీమా అందిస్తామని ప్రభుత్వం ప్రకటించిందని దీనిపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని గౌడ సంఘం వడ్డేపల్లి మండల అధ్యక్షుడు రాధాకృష్ణగౌడ్, ప్రధాన కార్యదర్శి పరమేష్‌గౌడ్‌లు శనివారం ఒక ప్రకటనలో కోరారు. కార్మికులకు బీమా ఎలా వర్తిస్తుంది, దానికి సంబంధించిన మార్గదర్శకాలు, ఇన్సూరెన్స్‌పై పూర్తిగా అవగాహన కల్పించాల్సిన బాధ్యత సంఘం నాయకులపై ఉందని పేర్కొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

మల్దకల్: జాబ్‌కార్డులు ఉన్న కూలీలందరూ ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ స్వామి కూలీలకు సూచించారు. శనివారం మండల కేంద్రంతో పాటు అమరవాయి, సద్దలోనిపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. వేసవికాలం దృష్ట్యా ఉదయం, సాయంత్రం వేళల్లో ఉపాధి పనులు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

గట్టు: మండల కేంద్రంలోని శివారులో కొనుగోలు కేంద్రం నుంచి వరిధాన్యం తీసుకుని వెళ్తున్న లారీ శనివారం అదుపు తప్పి రోడ్డు పక్కకు ఒరిగింది. ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రాణనష్టం జరగక పోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. యాసంగి వడ్లను రైతుల నుంచి సేకరించి, లారీలో లోడు చేసుకొని వెళ్తుండగా పూసలపాటి ఆంజనేయస్వామి దేవాలయం చెరువు కాలువ కల్వర్టు దగ్గర వాహనం అదుపు తప్పింది. లారీ డ్రైవర్ సురక్షితంగా బయట పడ్డాడు. మరో లారీలో వడ్లను లోడు చేసి మిల్లుకు పంపించారు.

ధాన్యం కొనుగోలుకు 30 వరకు గడువు

రాజోళి: పీఏసీఎస్ ద్వారా కొనుగోలు చేస్తున్న మొక్కజొన్నను గడువులోగా రైతులు విక్రయించుకోవాలని పీఏసీఎస్ సీఈఓ రవి కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 30వ తేదీ కొనుగోలు గడువు ముగుస్తుందని, మొక్కజొన్నను విక్రయించి ఆన్‌లైన్ చేసుకోవాలని కోరారు. రైతులు గమనించి ధాన్యాన్ని అమ్మాలని తెలిపారు.

వీరశైవలింగాయత్ సభకు తరలిరావాలి

గట్టు: హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించే వీరశైవలింగాయత్ మహాసభకు అధిక సంఖ్యలో తరలిరావాలని వీరశైవలింగాయత్ సంఘం నాయకుడు చంద్రశేఖర్, బూదెప్ప శనివారం ఓ ప్రకటనలో కోరారు. మహార్యాలీ, సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న వీరశైవలింగాయత్‌లు హాజరుకావాలని కోరారు.

జీతాలు ఇవ్వాలని ఉద్యోగుల ధర్నా

మానవపాడు: మండలంలోని కలుకుంట్ల శివారులో శనివారం నది బయో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఎదుట రోడ్డుపై ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. గత నెల 15వ తేదీన ధర్నా నిర్వహించగా కంపెనీ యాజమాన్యం దిగివచ్చి మే 16వ తేదీలోపల రెండు నెలలు జీతాలు ఇస్తామని హామీ ఇచ్చారని ఇప్పటికీ జీతాలు చెల్లించలేదని ఉద్యోగులు అశోక్‌రెడ్డి, పరుశ రాముగౌడ్, అంజనేయులు, శంకర్‌రెడ్డి, తదితరులు ధర్నా నిర్వహించారు. జీతాలు చెల్లించకుంటే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పెద్ద ఎత్తున ధర్నాలు చేపడుతామని హెచ్చరించారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపన సహకరించాలి

అమరచింత: పట్టణంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమాలకు సంబంధించిన తేదీలను ఖరారు చేశామని బొడ్రాయి ఉత్సవ కమిటీ సభ్యులు తాటికొండ రమేష్, భాస్కర్, కొరి శ్రీను తెలిపారు. ఆగష్టులో శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని 28, 29, 30 తేదీల్లో విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పట్టణ క్షేమం కోసం నిర్వహించే బొడ్రాయి ప్రతిష్ఠాపన ప్రజలు భాగస్వాములవ్వాలని కోరారు.